# ఇంతే ఈ ప్రేమికులు



**మధుశ్రీ**

శకుంతల ఆర్ట్స్ కాలేజీలో అడుగు పెట్టడమేమిటి నవయౌవ్వనాంకురిత యువక విద్యార్థిలోకానికి మనస్థిమితం తగ్గి పోవడమేమిటి రెండూ ఒకేసారి జరిగాయి.

కొన్ని షార్క్‌స్కిన్ బ్లౌజులూ, ఉలెన్‌పాంట్లూ జేబుల్లో చేతులు పెట్టుకుని గరల్స్ వెయిటింగ్ రూమ్ ఎదురుగుండా పచార్లు ప్రారంభించాయి.

మరికొన్ని నీరస హృదయాలు చాటుమాటుగా కన్నీళ్లు పెట్టుకున్నాయి జాలిగా, బాధగా . . . మరోకొన్ని సిగరెట్లు అంటించి ఉంగరాలుగా పొగలు వదిలాయి!

చక్రాల్లాంటి కళ్లు . . .

అసలు నడుంలేదు . . .

సంపంగి మొగ్గలా ముక్కు . .

సంవర్త్కాల తటిల్లతలా శరీరం . . .

ఒక యువ నవకవి గంగరావిచెట్ల కొమ్మలు పట్టుకుని తలకిందులు పక్షిలా వేలాడుతూ కవిత్వం కట్టుకుంటున్నాడు బ్లాంక్‌వెర్స్‌లో!

ఇంత సంచలనాన్నీ లేవదీసింది శకుంతల.

కొంతమంది బుద్ధిమంతులు శకుంతలను కాలేజీ మానెయ్యమని అర్జీ విన్నపాలు పెట్టుకున్నారు, ఎందుకంటే తాము చదువుకుని మొదటి తరగతిలో పాస్ కావాలనే సత్సంకల్పం కలవాళ్లు కనుక. ఆమె క్లాసులో కూర్చుంటే, ఆమె సౌందర్యం తమని చేతులెత్తి పిల్చి పాఠాలు పాడుచేస్తుందనే ఆరోపణతో పాతిక ముప్ఫయి సంతకాలతో ముసాయిదా పంపుకున్నారు . . .

ఆ ముసాయిదా పట్టుకువెళ్లి దాఖలు చేసుకున్న ఫ్యాన్ సుబ్బన్నని శకుంతల చెప్పు పుచ్చుకుని కొడతానని బెదిరించిందని కొన్ని చిల్లరమల్లర స్థానిక దినపత్రికలు సంపాదకీయం వ్రాశాయి.

అందగాళ్లుగా చలామణీ అయ్యే కొందరు ఆమెతో మాట్లాడ్డమే గొప్పగా భావించుకున్నారు. కొందరు మాట్లాడబోయి బోల్తాపడ్డ ఉదంతాలు కూడా ఉన్నాయి.

రంగారావు మటుకు ఆమెని గాఠంగా ప్రేమించేశాడు.

అసలతను ప్రేమించనే ప్రేమించడు . . . ప్రేమించాడంటే గాఠంగా ప్రేమించేస్తాడు. అతని నిఘంటువులో ప్రేమకి నిర్వచనం శకుంతలా నామ స్మరణమే! ఆ ప్రేమకాస్తా ముదిరి ఊరుకుంది.

ముదిరి ప్రేమగీతాలు( కృష్ణశాస్త్రి, వాళ్లవీని ) పాడుకోవడం వరకు వచ్చింది.

క్లాసులో పాఠాలు మానేసి ఆమెకేసి చూస్తూ కూర్చుంటున్నాడు. సిగరెట్టు ఎలా ఉంటుందో ఎరగని వాడల్లా రోజూ నాలుగు పెట్టెలు తగలేస్తున్నాడు. మడతలు నలగకుండా బట్టలు కట్టుకుంటున్నాడు.

కాలేజీ వదలగానే సంరక్షకుడిలాగ ఆమెని ఇంటి వరకూ దిగబెడుతున్నాడు.

శకుంతల ఇతని చేష్టలు కనిపెడుతూనే ఉందికాని, నిర్లక్ష్యంగా తన గొడవ తను చూసుకుంటూంది.

రంగారావుకి శకుంతల కాలేజీకి రానిరోజు అమావాస్య. ఆమె కాలేజీ వదిలి ఇంటికి వెళ్ళేటప్పుడు కూడా బయలుదేరుతాడు.

"శకూ . . . ."

ఆమె వెనక్కి తిరుగుతుంది.

బుద్ధిమంతుడిలాగ, ఒకటోక్లాసు కుర్రాడిలాగ ఎటో చూస్తాడు, ఏమీ ఎరగనట్లు . . .

ఆమె విసవిసా నడిచిపోతుంది.

"కుంతలా. . ."

మళ్లీ తిరిగింది.

చిరునవ్వులు చిలకరించాడు. కాలరు సర్దుకున్నాడు. జేబురుమాలు తీసి ఒకసారి అనవసరంగా ముక్కు దగ్గిర పెట్టుకుని మళ్లీ జేబులో కుక్కేశాడు.

"సావిత్రీ, ఈ గాడిదెవడే?" అంటకాల్చింది పక్కనేఉన్న సావిత్రితోటి.

చిరునవ్వులు పోయి చిరుచమటలు పోశాయి రంగారావుకి. ముఖం నల్లపూసంతయింది.

పకపక నవ్వింది ప్రక్కనే నడుస్తున్న సావిత్రి.

పళ్లు పటపట కొరుక్కున్నాడు సావిత్రిని చూసి రంగారావు. నిత్యం రంగారావు తనవెంటబడడం శకుంతలకేమీ బాగాలేదు. దీని అంతు చూడాలనుకుంది.

● ● ● ●

కాలేజీ కాంపౌండు మీద కొట్టవస్తున్నట్లుగా రంగారావుకీ, శకుంతలకీ పెళ్లి అని మసిబొగ్గుతో రాసిన అక్షరాలు . . . .

అందంగా ఉండడం కూడా తప్పే! అందంగా లేకపోతే "ముచ్చు" అనీ, "చింతపండు" అనీ "కోతి" అనీ, "రాక్షసి" అనీ పేర్లుపెట్టి ఏడిపిస్తారు. అందంగా ఉంటే కాలేజీ మానివెయ్యమని కొందరు, ప్రేమ అనే వెర్రిభ్రమలోపడి కొందరు తిరుగుతూంటారు! ఇలా ఆలోచించిన కొలదీ శకుంతల మనసు క్షోభ పడుతూంటుంది.

తరుణోపాయం కోసం వెదికింది.

చిన్న ఆలోచన కాంతికిరణంలా మదిలో మెదిలింది. ప్రయోగం చేసి చూద్దామనుకుంది. ఫలిస్తే పరవాలేదు. ఫలించకపోతే ప్రమాదంలేదు.

రంగారావు ఎప్పటిలాగా తన విధులు నిర్వర్తించుకు

---

కాలేజీలలో కాస్త కనుముక్కు తీరు, రంగు ఉన్న ప్రతి అమ్మాయి అబ్బాయిల చూపుకి అప్సరసగానే కనిపిస్తుంది. అమాంతంగా ప్రేమలో పడిపోయినట్లు నటిస్తారు. కానీ అదే అమ్మాయి ఎదురు నిలిచి, నేనూ 'రెడీ', పద పెళ్లాడుదాం అంటే గుండెదిటవున్న కుర్రాళ్లు ఎంతమంది?

# ఉగాది లక్ష్మి

దూపాటి
సంపత్కుమారాచార్య

చిగురాకు పందిళ్ళ చిన్నారి పువ్వులు
సరసత స్వాగతాంజలులు గూర్ప!

నవమరంద తృషార్త యువబంభరశ్రేణి
యలరు తేనియల పాద్యమ్ము గూర్ప!

తొలిచూలు ఫలముగా నెలమావి కొంగ్రొత్త
ఫలముల నేరి నైవేద్య మొసగ!

కలకల స్వనముల గళమెత్తి కోయిల
యానంద రాగమ్ము లాలపింప!

యభ్యుదయ పథగాములై యఖిల జనులు
పరవశింప మనోవేది పదము లూన
నవ్యశోభలు దిక్తటి నాట్యమాడ
రమ్ము కీలక సంవత్సరాది రాజ్ఞి. ✳

పోతున్నాడు.

సమయం కోసం వేచి ఉంది శకుంతల.

ఆ రోజు కాలేజీ వదిలి వెయ్యగా శకుంతల రోడ్డు వారగా నడుస్తోంది. రివ్వుమని సైకిలుమీద వచ్చివాలాడు రంగారావు అర్జంటు పని ఉన్నవాడిలా, ఎక్స్‌ప్రెస్ ఉత్తరం మోసుకు వచ్చే పోస్ట్‌మాన్‌లాగ. క్రీగంట కనిపెడుతూనే ఉంది శకుంతల.

"గుడ్ ఈవెనింగ్ శకూ —" ఎలాగో అనేశాడు.

మళ్ళీ జవాబుగా ఆమె కూడా విష్ చేసింది.

గాలిలో తేలిపోతున్నట్లయింది రంగారావుకి. ఆమెతో మాట్లాడ్డం ఉత్తమ నాయక లక్షణంగా భావించుకున్నాడు.

"మిస్ — శకుంతలా మీతో చిన్నపని ఉంది" అని జేబులోంచి చిన్న చీటీ తీసి ఆమె చేతిలో పెట్టి సైకిలెక్కి వెళ్లిపోయాడు.

ఇంటికి వెళ్ళి శకుంతల గదిలో కూర్చుని కాగితం విప్పి చదవడం మొదలుపెట్టింది.

ఉత్తరం నిండా ప్రేమపాఠాలే!

తన హృదయం విలవిలలాడి పోతూంది!

శకుంతల లేని తన జీవితం వృథాయేనట! ఆమె తన జీవిత పరమావధిట. ఇంకా ఏవో సామాన్య మానవుడి భావానికందని వ్రాశాడు దానినిండా.

నవ్వుకుంది శకుంతల.

మరునాడు మిగిలిన విషయం చూసుకోవచ్చు. ఆ రోజురాత్రి ఆలోచిస్తూ పడుకుంది.

* * *

సాయంత్రం నాలుగయింది.

శకుంతల ఇంటికి వెడుతూంది.

రంగారావు వచ్చాడు.

అతన్ని చూచి చిరునవ్వు నవ్వింది.

అతను సర్వస్వం మరిచిపోయి కూడా నడుస్తున్నాడు. సందు మొగదగ్గిరికి వెళ్ళేసరికి —

"రంగారావూ . . . ." మంగళ గళం విప్పింది.

వెయ్యి వీణెలు మీటినట్లూ,

పాతిక ఫిడేళ్ళు వాయిస్తున్నట్లూ,

అనిపించింది అతని కామె పిలుపు.

"దివ్య కంఠం! . . . ."

లనుకోకుండా ఉండలేకపోయాడు.

ఏందుకన్నట్టు చూశాడు.

"ఒక్క నిమిషం ఆగాలి . . . నీతో మాట్లాడాలి!" అంది కళ్ళు అందంగా తిప్పుతూ.

సరే నన్నాడు.

"చూడు రంగారావూ — నీ ఉత్తరం చదివాను. అర్థం చేసుకున్నాను. నువ్వెప్పుడూ ఎవ్వరికీ ఉత్తరాలు వ్రాయకు . . . మనసారా మాట్లాడు. ఆ మాత్రం ధైర్యం నీకు లేదూ?"

బుర్ర వంచుకుని నిలబడ్డాడు.

"నేనేం దివ్య సౌందర్యరాశిని కాదు, స్వర్గాన్నించి దిగివచ్చిన అప్సరాంగననికాదు, నన్నే పూజించి నువ్వు మనసు పాడు చేసుకోవడానికి. సామాన్యురాలినే! అందర్నీ ప్రేమించినట్లు నిన్నూ ప్రేమిస్తున్నాను. దానికంతకీ అతీతమైనదంటావా నీ ప్రేమ — ఒప్పుకుంటాను."

వింటూ నడక ప్రారంభించాడు —

"మా నాన్న నా పెళ్లి విషయంలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చాడు నాకు. ఆయన వరకట్నం నిషేధించే వాళ్లలో ప్రథముడు. ఆ ఆదర్శంతోటే ఇంతవరకూ చేసుకు వచ్చాడు. ఆయన కట్నం ఇవ్వడు. పుచ్చుకోడు. మీ నాన్నగారి ఉద్దేశ్యాలు నాకు తెలియవు కదా! ఏదైనా, మనం యువకులం. కనక వరకట్న నిషేధానికి ముందడుగు వెయ్యాలి! వేసి లోకానికి మార్గ దర్శకులం కావాలి!

ఆడపిల్లలకు పెళ్లిళ్ళుచేసి కన్నతండ్రి ముష్టిచెంబు చేత బట్టుకుంటున్నాడు. ఆడపిల్ల పుడితే సంతోషించడానికి బదులు ఏడుస్తున్నాడు. కట్నం అయిదు వేలూ, పెళ్లి చెయ్యడానికి మరో అయిదు వేలూ అయితే దిబ్బయి పోతున్నాడు.

"అలాంటివి కొన్ని అయినా మనం ఉద్ధరించాలి . . పిచ్చికూతలు కూసుకుంటూ నా కూడా కూడ తిరగవలసిన అవసరం నీకేంలేదు. నేను అందని అందాన్ని కాదు. గగన కుసుమాన్ని కాదు. ఒక ఆడపిల్లని. సామాన్యురాలిని! పౌరుషంగా ముందుకు వచ్చి నిలబడు. దమ్మిడీ ఖర్చు లేకుండా పెళ్లి చేసుకుందాం. అప్పుడు నీకన్న ఎక్కువగా ప్రేమిస్తాను. ఆదరిస్తాను! నువ్వూ మేజర్‌వే! భయపడవలిసిన అవసరంలేదు. మీ తల్లి తండ్రులు నిన్నేమీ అనరనే ధైర్యం నీకుంటే నడు, రిజిస్ట్రార్ ఆఫీస్‌కి! . . .

"మా నాన్నా బాధ పడుతున్నాడు నాకు పెళ్లి చెయ్యలేకపోయానని.

"మన దాంపత్యం ఆదర్శప్రాయంగానూ ఉంటుంది. అదీకాక మనకి వేలకి వేలిచ్చి కాలేజీల్లో చదివిస్తున్నారు. మనం వచ్చిన పని చదువు. మన పని నిర్వర్తించుకోవడం మన విధి. అనవసరంగా ప్రేమనే భ్రమలోపడి చదువునీ జీవితాన్నీ వృథా చేసుకోకు! . . .

"కాదంటావా — పెళ్లి చేసుకో. నేనూ సిద్ధమే. ఏమంటావు రంగారావ్? ఆ మాత్రం ధైర్యం లేదా నీకు?"

అనర్గళంగా ఉపన్యసించింది.

ఆమె కేక పెడుతున్నా వినిపించుకోకుండా సైకిలెక్కి రివ్వుమని ఎగిరిపోయాడు!

"ఈ ప్రేమికులింతే!" అని వెళ్లిపోతున్నరంగారావుని చూసి పకపక నవ్వుకుంది.

( అంకితం: కాలేజీ అమ్మాయిలకి ) ★